క్లుప్తంగా

ఎంఈఓ తనిఖీలు



ఉదయగిరి: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో క్లాస్‌రూం బేస్డ్ అసిస్మెంట్–2, ఎస్ఏ–3 పరీక్షల నిర్వహణను ఎంఈఓ షేక్ మస్తాన్‌వలి బుధవారం తనిఖీ చేశారు.దుర్గంపల్లి ప్రాథమిక పాఠశాలను సందర్శించి పరీక్షలను తనిఖీ చేసి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు.

పరామర్శ



జలదంకి: మండల జెడ్పీటీసీ మేదరమెట్ల శివ లీల కుటుంబ సభ్యులను కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. ఇటీవల జెడ్పీటీసీ తల్లి లక్ష్మమ్మ మృతి చెందిన నేపథ్యంలో కావలిలోని నివాసానికి చేరుకుని పరామర్శించి సానుభూతి తెలిపారు. అనంతరం బ్రాహ్మణక్రాకలో తన మేనత్త దేవరపల్లి కామమ్మ ఉత్తరక్రియలకు హాజరయ్యారు.

మినీట్రక్కు బోల్తా

సీతారామపురం: బసినేనిపల్లి సమీపంలోని పోలేరమ్మ గుడివద్ద సీతారామపురానికి చెందిన ఇండేన్ గ్యాస్ ఏజెన్సీకి చెందిన మినీ ట్రక్కు బుధవారం బోల్తాపడింది. డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు.వాహనంలో ఖాళీ సిలిండర్లు మాత్రమే ఉండడంతో పెను ప్రమాదం తప్పింది.

పొరుగు మద్యం పట్టివేత

మర్రిపాడు: బ్రాహ్మణపల్లి టోల్‌ప్లాజా వద్ద అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యం బాటిళ్లను ఉదయగిరి సెబ్ అధికారి మురళీకృష్ణ బుధవారం వేకువన పట్టుకున్నారు. టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా బెంగళూరు నుంచి కనిగిరి వెళుతున్న ఎస్వీబీటీ ప్రైవేట్ ట్రావెల్స్‌లో 9 టెట్రా ప్యాకెట్లతో పాటు రెండు ఫుల్ బాటిళ్ల కర్ణాటక మద్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. మద్యాన్ని తరలిస్తున్న బెంగళూరుకు చెందిన కొండయ్యను అరెస్ట్ చేశారు.

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యానికి మద్దతు ధర

సంగం: ధాన్యానికి మద్దతు ధర కల్పించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ లక్ష్మీప్రసన్న కోరారు. స్థానిక సచివాలయంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై రైతులతో బుధవారం ఆమె సమావేశం నిర్వహించారు. ధాన్యం కొనుగోళ్లలోని సమస్యలను అడిగి తెలుసుకుని ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



ఆత్మకూరురూరల్: వలంటీర్లు, గృహసారథులు ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ వల్లభనేని రాజేంద్ర సూచించారు. బోయలచిరివెళ్ల, వాశిలి, చెర్లోయడవల్లి సచివాలయాల పరిధిలోని గృహసారథులు, వలంటీర్లతో బుధవారం వారు సమావేశమై విధులపై దిశా నిర్దేశం చేశారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పెమ్మసాని శ్రీనివాసులు నాయుడు, రామిరెడ్డి మోహన్‌రెడ్డి, మంతు చిన్న యానాదిరెడ్డి, రావూరు శ్రీనివాసులురెడ్డి, బొలిగర్ల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు



చేజర్ల: మాముడూరులో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ విజయలలిత పేర్కొన్నారు. మాముడూరు సచివాలయంలో గడప గడపకు మన ప్రభుత్వంపై సమీక్ష సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. నివేశన స్థలాలు, డ్రైనేజీ, తదితర సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. తహసీల్దార్ శివకృష్ణయ్య, సర్పంచ్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలిరెడ్డి సుధాకర్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

ఆత్మకూరు: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వెంకట్రావుపల్లి గిరిజనకాలనీకి చెందిన మల్లిక అంకయ్య(77)చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్సై సాయిప్రసాద్ బుధవారం తెలిపారు. గత నెల 29న అంకయ్య ఆత్మకూరు బైపాస్‌రోడ్డులో నడుచుకుంటూ వెళ్తుండగా మోటారు సైకిల్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు



వృద్ధురాలికి ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

- ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

మర్రిపాడు: ఆత్మకూరు నియోజకవర్గ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కృష్ణాపురంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం ఆయన నిర్వహించారు. తొలుత ఎమ్మెల్యేకు స్థానిక నాయకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే మినరల్ వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించి ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాలను వివరించారు. ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలుపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేదల సంక్షేమానికి అనేక పథకాలను అమలు చేస్తున్నారని వివరించారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా పారదర్శకంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. రైతుల సంక్షేమానికి రైతుభరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు, ఎరువులను సబ్సిడీపై అందిస్తున్నారని తెలిపారు. మండలంలోని రెవెన్యూ సమస్యలను ఆరు నెలల్లో పరిష్కరిస్తామన్నారు. ప్రభుత్వం అగ్రిమెంట్, చుక్కల భూముల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. జాయింట్ కలెక్టర్‌తో సమావేశాలు నిర్వహించి భూ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. రీసర్వే ద్వారా భూసమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. గడపగడపకులో వచ్చిన సమస్యలపై ప్రతి రెండు నెలలకోసారి సచివాలయంలో రివ్యూ మీటింగ్ నిర్వహించి పరిష్కరిస్తామన్నారు. తహసీల్దార్ హేమంత్‌కుమార్, సర్పంచ్ హరిబాబు, ఎంపీటీసీ రమణమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొర్రా సుబ్బిరెడ్డి, జేసీఎస్ కోఆర్డినేటర్ సిద్దంరెడ్డి మోహన్‌రెడ్డి, నాయకులు గంగవరపు శ్రీనివాసులునాయుడు, సోమల మాధవరెడ్డి, నాయకులు లక్ష్మిరెడ్డి, సిద్దారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మాధవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలి

కావలి రూరల్: యువత నైపుణ్యాలను పెంపొందించుకుని ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుత ఆధునిక యుగంలో యువత ఏ విషయంలోనూ నిరుత్సాహం చెందకుండా నైపుణ్యాలను పెంపొందించుకుని పట్టుదలతో అనుకున్న లక్ష్యాలను సాధించి తల్లిదండ్రులు, దేశానికి మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పాఠశాల స్థాయి నుంచే చదువుతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్ నేర్పిస్తే సులభంగా ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. గతంలో ఉద్యోగావకాశాలు లభించక ఎంతో మంది యువత ఆత్మహత్యలు చేసుకున్న ఘటనలు ఉన్నాయన్నారు. ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం జాబ్‌మేళాలతో నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలను కల్పిస్తోందన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ఏర్పాటు ద్వారా ఎంతో మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించి వారి కుటుంబాల్లో వెలుగులు నింపిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. అనంతరం వివిధ కంపెనీల ప్రతినిధులు నిరుద్యోగ యువతకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. కావలి ఆర్డీఓ శీనానాయక్, డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డి, ఎంప్లాయిమెంట్ అధికారి సురేష్ కుమార్, ఏఎంసీ చైర్మన్ సన్నిబోయిన ప్రసాద్, ఎంపీపీ ఆలూరు కొండమ్మ, జెడ్పీటీసీ జంపాని రాఘవులు, ఎంపీడీఓ సుబ్బారావు, ఏపీఎం కాంతారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

గ్రంథాలయంలో తనిఖీలు

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేట గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కే కుమార్‌రాజు బుధవారం తనిఖీ చేశారు. గ్రంథాలయ సెస్సు బకాయిలు సంస్థకు జమయ్యేలా చూడాలని లైబ్రేరియన్ శ్రీనివాసరాజుకు సూచించారు. ఆయన వెంట గ్రంథాలయ నిర్వాహకుడు ఈవీ చలపతిరావు ఉన్నారు.

కేంద్ర బృందం పరిశీలన

బిట్రగుంట: బోగోలు మండలంలోని జక్కేపల్లి గూడూరు, సుందరగిరివారికండ్రిగ పంచాయతీల్లో జాతీయ మూల్యాకన కమిటీ ప్రిన్సిపల్ కోఆర్డినేటర్ అంబటి శ్రీనివాస్, కోఆర్డినేటర్ కిరణ్ బృందం బుధవారం పర్యటించింది. ఉపాధి హామీ, జలజీవన్ మిషన్, అంగన్‌వాడీ మాతృ వందనం, స్వయంసహాయక సంఘాలకు ఎన్ఆర్ఎల్ఎం ద్వారా జీవనోపాధుల కల్పన, తదితర కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుతీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డి, డ్వామా ఏపీడీ నిర్మలాదేవి, ఎంపీడీఓ గోవిందరావు, మండలాధికారులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

అల్లూరు: ఇస్కపల్లి పంచాయతీ కొత్తకుర్రులో గంజాయి విక్రయాలపై కోవూరు సెబ్ సీఐ నరహరి తన సిబ్బందితో బుధవారం దాడులు నిర్వహించారు. బుచ్చంగారి లక్ష్మమ్మ ఇంట్లో 250గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. గంజాయి సరఫరాదారులను త్వరలో పట్టుకుంటామని చెప్పారు. మండలంలో ఎవరైనా మాదకద్రవ్యాలను విక్రయిస్తున్నా, వినియోగిస్తున్నా 14500 , 94409 02524 నంబర్లకు తెలియజేయాలని కోరారు. ఈ దాడుల్లో సెబ్ ఎస్సైలు టీ శ్రీనివాసులు, డీ శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఈక్రాప్ నమోదు తప్పనిసరి



జలదంకి: రైతులు ఈక్రాప్ నమోదును తప్పనిసరిగా చేయించుకోవాలని జేడీఏ సుధాకర్‌రాజు సూచించారు. చోడవరం, జలదంకి గ్రామాల్లో ఈక్రాప్ నమోదును బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈక్రాప్‌లో నమోదు చేసిన పంటల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులతో మాట్లాడారు.రైతులు ఈక్రాప్‌తో పాటు ఈకేవైసీ చేయించుకుంటే ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవచ్చని తెలిపారు. ఆయన వెంట ఏడీఏ నర్సోజీరావు, ఏఓ శైలజ, వీఏఏలు ఉన్నారు.

వివాదాస్పద భూముల పరిశీలన



సోమశిల: అనంతసాగరం మండలం చాపురాళ్లపల్లిలోని వివాదాస్పద భూములను జేసీ రోణంకి కూర్మనాథ్ బుధవారం పరిశీలించారు. చాపురాళ్లపల్లిలోని రెవెన్యూ, అటవీ భూముల వివాదానికి సంబంధించిన కేసు హైకోర్టులో విచారణ జరుగుతోంది. ఈ నేపథ్యంలో హైకోర్టు ఉత్తర్వుల మేరకు జిల్లా అటవీశాఖ అధికారి చంద్రశేఖర్‌రావు, సర్వే ఏడీ హనుమాన్ ప్రసాద్‌తో కలిసి జేసీ భూములను పరిశీలించినట్లు తహసీల్దార్ అన్నదాత వెంకటరమణరావు తెలిపారు. ఆత్మకూరు రేంజర్ రామకొండారెడ్డి, డీఆర్వో ఖాజారంతుల్లా, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

భూసేకరణపై విచారణ

చేజర్ల: జాతీయ రహదారికి భూసేకరణపై నాగలవెలటూరు రైతులతో మండల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శివకృష్ణయ్య బుధవారం సమావేశమయ్యారు. బద్వేలు నుంచి మర్రిపాడు, అనంతసాగరం, కలువాయి, చేజర్ల, పొదలకూరు మీదుగా నెల్లూరు వరకు నాలుగులేన రహదారిని నిర్మించనున్నారు. ఇందుకు సంబంధించి నాగులవెలటూరు పరిధిలో భూములు కోల్పోతున్న రైతుల భూముల పత్రాలను పరిశీలించి నష్టపరిహారంపై చర్చించారు. డీటీ విజయ్,ఆర్ఐ కే సుమతి, ప్రసాద్ పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



ఆత్మకూరు: మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనమవుతాయని, వాటికి విద్యార్థులు దూరంగా ఉండాలని ఆత్మకూరు సెబ్ ఇన్‌స్పెక్టర్ బీ నయనతార అన్నారు. పట్టణంలోని ఐటీఐలో విద్యార్థులకు మాదకద్రవ్యాలతో కలిగే అనర్థాలపై బుధవారం ఆమె అవగాహన కల్పించారు. సెబ్ ఎస్సై మొఘల్ బాబు, ఐటీఐ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు నమోదు వేగవంతం

ఆత్మకూరురూరల్: ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓట్ల నమోదును వేగవంతం చేయాలని తహసీల్దార్ లక్ష్మీనరసింహం బీఎల్వోలను ఆదేశించారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో డీటీ రాజేష్‌తో కలిసి బీఎల్వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గతంలో పట్టభద్రులకు సంబంధించి 1885, ఉపాధ్యాయులకు సంబంధించి 321 మంది ఓటుకు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఆత్మకూరు ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ నియోజకవర్గానికి 1, పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి 2 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసేలా ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపామన్నారు. సీనియర్ అసిస్టెంట్ కొండయ్య, ఆర్ఐ పృథ్వీ, వీఆర్ఓలు, బీఎల్ఓలు పాల్గొన్నారు.

కలెక్టర్ ఉత్తర్వులు బేఖాతరు

- విధుల్లో చేరని డీటీలు
- అపరిష్కృతంగా రెవెన్యూ సమస్యలు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు

ఉదయగిరి,వరికుంటపాడు: జిల్లాలో పడమటి వైపున చిట్టచివరి మండలమైన వరికుంటపాడు విస్తీర్ణం పరంగా అతిపెద్ద మండలం. మండలంలో 24 పంచాయతీలు, 28 రెవెన్యూ గ్రామాలు, 56 విలేజ్‌లు ఉన్నాయి. జిల్లా కేంద్రానికి 120 కిమీ దూరంలో ఉన్న ఇక్కడ ఏమి జరుగుతుందో ఉన్నతాధికారులకు పెద్ద సమాచారం ఉండదు. మండలంలో రెవెన్యూపరమైన సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. ప్రస్తుతం ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారానికి అనేక చర్యలు తీసుకుంటోంది. ఈ పనులు సకాలంలో సజావుగా సాగాలంటే రెవెన్యూ సిబ్బంది ఎంతో అవసరం. అయితే మండల రెవెన్యూ కార్యాలయంలో అనేక కీలక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ముఖ్యంగా రెండు డిప్యూటీ తహసీల్దార్ పోస్టులు, ఒక ఆర్ఐ పోస్టు ఎంతో కాలంగా ఖాళీగా ఉన్నాయి. కలెక్టర్ తరచూ పోస్టింగులు వేస్తున్నా, అధికారులు విధుల్లో చేరకుండా మళ్లీ పైరవీలు చేసుకుని జిల్లా కేంద్రం చుట్టు పక్కల ఉండే మండలాలకు వెళుతున్నారు. దీంతో దీర్ఘకాలికంగా ఆ కుర్చీలు ఖాళీగా దర్శనం ఇస్తున్నాయి.

కలెక్టర్ ఉత్తర్వులకు విలువేదీ?

గత మూడు నెలల నుంచి కలెక్టర్ పలువురు డీటీలు, ఆర్ఐలకు వరికుంటపాడులో పోస్టింగులు ఇచ్చారు. అయితే వారు విధుల్లో చేరకుండా ఉండడమో లేక చేరిన వెంటనే సెలవులపై వెళ్లడమో జరుగుతోంది.దీంతో కలెక్టర్ ఉత్తర్వులకు విలువ లేకుండా పోయింది. గత మూడ్రోజులు కితం కలెక్టర్ ఇద్దరు డీటీలకు పోస్టింగులు ఇచ్చారు.కానీ వారు ఇంత వరకు విధుల్లో చేరలేదు. వారిలో ఒకరు చంటి బిడ్డ తల్లి కావడంతో మెటర్నిటీ లీవులో ఉండే అవకాశం ఉంది. మరో అధికారిణి డెల్టా చుట్టపక్కల మండలాల్లో తప్ప మరోచోట పని చేసిన సందర్భాలు చాలా తక్కువని తోటి ఉద్యోగులు చెబుతున్నారు. కలెక్టర్ ఆర్డర్ అందినా విధుల్లో చేరకుండా అక్కడే ఉండేందుకు పైరవీలు చేస్తున్నట్లు సమాచారం. దీంతో కలెక్టర్ ఉత్తర్వులకు విలువ ఏమిటనే ప్రశ్నగా మారింది.




వరికుంటపాడు తహసీల్దార్ కార్యాలయం

ముందుకు సాగని పనులు


మండలంలో భూ సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. అవి పరిష్కారం కాలాలంటే తగినంత మంది రెవెన్యూ సిబ్బంది అవసరం. భూసర్వే, సాదా బైనామాలను త్వరగా పూర్తి చేయాల్సి ఉంది. ఈ పనులను తహసీల్దార్ ఒక్కరే చేయాల్సిరావడంతో ముందుకు సాగడం లేదు. దిగువ స్థాయి సిబ్బంది ఉన్నా వారు సకాలంలో విధులకు రావడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా అధికారులు వెంటనే రెవెన్యూ సిబ్బందిని నియమించాల్సిన అవసరం ఉంది.

విధుల్లో చేరడం లేదు



జిల్లా అధికారులు పోస్టింగులు ఇస్తున్నా ఎవరూ విధుల్లో చేరడం లేదు. ఒక వేళ చేరిన వెంటనే సెలవుపై వెళుతున్నారు. దీంతో పనిఒత్తిడితో రెవెన్యూ సమస్యలను సకాలంలో పరిష్కరించలేకపోతున్నాం. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళుతాం. – హమీద్, తహసీల్దార్

వైభవంగా పోలేరమ్మ గ్రామోత్సవం



అల్లూరు: నగర పంచాయతీ పరిధిలోని ఆర్టీఆర్ కాలనీలో మంగళవారం రాత్రి పోలేరమ్మ గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. పోలేరమ్మను ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కోలాట ప్రదర్శనను తిలకించారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు మన్నెమాల సుకుమార్‌రెడ్డి, దండా కృష్ణారెడ్డి, నీలం సాయికుమార్, దైవాదీనం, ఊటు శ్రీకాంత్‌రెడ్డి, సామంతుల సురేష్‌రెడ్డి, గోళ్ల రాజేష్, షేక్ ఉస్మాన్‌షరీఫ్, బత్తుల సుధాకర్, షేక్ రసూల్, సుధీర్‌రెడ్డి, నిమ్మల భాస్కర్, శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

మెట్టుకూరు నియామకంపై హర్షం



సీతారామపురం: ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకుడిగా మెట్టుకూరు ధనుంజయరెడ్డిని పార్టీ అధిష్టానం నియమించడం శుభపరిణామమని ఆ పార్టీ మండల నాయకులు పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చింతంరెడ్డి సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, మెట్టుకూరు ధనుంజయరెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉదయగిరి దుర్గం, సిద్దేశ్వరం ప్రాంతాలను పర్యాటక ప్రదేశాల జాబితాలో చేర్చి కోట్లాది రూపాయల నిధుల కేటాయింపునకు కృషిచేసిన ఎమ్మెల్యే మేకపాటికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. మండల సచివాలయాల కన్వీనర్ బాలినేని మాబయ్య, మాజీ వైస్ఎంపీపీ రామిశెట్టి తిరుపతయ్య, దేవమ్మచెరువు ఉపసర్పంచ్ లకిడి బ్రహ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి జాబ్‌కార్డులకు ఆధార్ సీడింగ్

ఉదయగిరి: ఉపాధి జాబ్‌కార్డులకు ఆధార్ అనుసంధాన ప్రక్రియను వేగవంతం చేయాలని ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్ ఆదేశించారు. పట్టణంలోని సచివాలయం–1లో ఉపాధి సిబ్బంది, గ్రామ వలంటీర్లతో బుధవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇన్‌చార్జి ఏపీఓ శ్రీనివాసులు, వెల్ఫేర్ అసిస్టెంట్ నారాయణ, మండల కోఆర్డినేటర్ గాజుల ఇమ్రాన్ పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యం



ప్రభుత్వ పథకాల కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి : ప్రజాసమస్యల పరిష్కారమే గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం లక్ష్యమని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని అన్నగారిపాళెం పంచాయతీ పరిధిలోని వెంకటేశ్వరపురంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం ఆయన నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాలను వివరించారు. ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలుపై ఆరాతీశారు. ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందజేస్తూ పేదల గుండెల్లో నిలిచిపోయారన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలను ఏర్పాటు చేసి ప్రజల ముంగిటకే పాలనను తీసుకొచ్చారని కొనియాడారు. గ్రామీణాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తూ భావితరాలకు ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. రాష్ట్రాభివృద్ధికి రాబోయే ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌ను ఆదరించాలని కోరారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సంకల్పానికి వారధిలా నిలవాలి

సోమశిల: సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు,వలంటీర్లు సమన్వయంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలను గడప గడపకు అందించి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంకల్పానికి వారధిలా నిలవాలని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. అనంతసాగరంలోని నేషనల్ ఫంక్షన్ హాల్‌లో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాపూరు వెంకటసుబ్బారెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ అక్కలరెడ్డి అంకిరెడ్డి ఆధ్వర్యంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లకు శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు సింగసాని గురుమోహన్‌తో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా అర్హులైన ప్రతిఒక్కరికీ అందేలా కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలను ఇంటింటికి తీసుకెళ్లి వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. జగనన్న చేపడుతున్న అభివృద్ధిని చూసి ఆయన స్ఫూర్తితో ఆత్మకూరు నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే ఏడీఎఫ్‌కు ఎంజీఆర్ ఫౌండేషన్ ద్వారా రూ.10 కోట్లు కేటాయించామని తెలిపారు. గురుమోహన్ మాట్లాడుతూ గృహసారథులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం ఎమ్మెల్యేతో పాటు గురుమోహన్‌ను స్థానిక నాయకులు శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా అనంతసాగరంలోని జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేకు సీపీఎం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ, వైస్ ఎంపీపీలు అల్లంపాటి సుధాకర్‌రెడ్డి, పాణెం శ్రీనివాసులు, శాప్ డైరెక్టర్ కాలువ నరసింహులు, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి బిజివేముల ఓబులరెడ్డి, బట్రెడ్డి జనార్దన్‌రెడ్డి, బుట్టి వెంకటసుబ్బారెడ్డి, అక్కలరెడ్డి కొండారెడ్డి, పార్లపల్లి రవికుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

ఆత్మకూరురూరల్: నుడా పరిధిలో చేరడంతో ఆత్మకూరు మండలానికి నూతనంగా 599 ప్రభుత్వ గృహాలు మంజూరయ్యాయని, అర్హులకు గృహాలను మంజూరు చేసి నిర్మాణాలను వేగవంతం చేయాలని జెడ్పీ సీఈఓ, ఆత్మకూరు మండల ప్రత్యేకాధికారి చిరంజీవి అధికారులను ఆదేశించారు. బట్టేపాడులోని జగనన్న కాలనీ లేఅవుట్‌ను అధికారులతో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం బట్టేపాడు సచివాలయాన్ని సందర్శించి రికార్డులను తనిఖీ చేసి సిబ్బందికి సూచనలు చేశారు. బట్టేపాడు పొలాల్లో ఈక్రాప్ నమోదును తనిఖీ చేశారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. నుడా గృహాల జియో ట్యాగింగ్‌ను సత్వరమే పూర్తి చేయాలన్నారు. మండలంలో ఇంటి పన్నుల బకాయిలు రూ.11 లక్షలు మేర ఉన్నాయని, పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఎంపీడీఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.



బట్టేపాడులో లేఅవుట్‌ను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ చిరంజీవి

సంక్షేమ సారథుల్లా వ్యవహరించాలి

బిట్రగుంట: గ్రామవలంటీర్లు, గృహసారథులు సంక్షేమ సారథుల్లా వ్యవహరించాలని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో గృహసారథులు, గ్రామవలంటీర్లతో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతీపేద కుటుంబానికి సంక్షేమ పథకాలతో అండగా నిలవాలనేదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అందులో భాగంగా దేశంలో ఎక్కడా లేని విధంగా సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను అందుబాటులోకి తీసుకొచ్చి పేదలకు ఇంటి ముంగిటే సంక్షేమ పథకాలు అందజేస్తోందన్నారు. గృహసారథులు, వలంటీర్లు సమన్వయంతో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించి ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చేందుకు కృషి చేయాలన్నారు. అధికారంలోకి వస్తే సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను రద్దు చేస్తామని బహిరంగంగా బెదిరిస్తున్న చంద్రబాబు లాంటి వ్యక్తులు రాష్ట్రానికి అవసరం లేదన్నారు. ప్రజలకు మేలు చేయాలనే సత్సంకల్పం కలిగిన జగనన్న వంటి ప్రజానేతలు రాష్ట్రానికి అవసరమన్నారు. ఎంపీపీ మేకల సుజాత, జెడ్పీటీసీ ఎం కీర్తన, వైస్ఎంపీపీ ఎం పద్మ, బోగోలు సర్పంచ్ అనిత, నాయకులు ఎం వీరరఘు, తూపిరి పెంచలయ్య, మేకల శ్రీనివాసులు, పలువురు నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.